## క్లుప్తంగా

### హిందూ ఐక్యత శక్తి యాత్రను జయప్రదం చేయండి

పహాడీషరీఫ్: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 22న మామిడిపల్లి నుంచి నిర్వహించే హిందూ ఐక్యత శక్తి యాత్ర(బైక్ ర్యాలీ)లో హిందు బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని గ్రామ దేవాలయాల కమిటీ చైర్మన్ ఎడ్ల వాసుదేవారెడ్డి కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. శ్రీ పంచముఖి హనుమాన్ వ్యాయామశాల కమిటీ ఆధ్వర్యంలో ఏటా ఈ యాత్రను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని తెలిపారు.

### పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ఆర్య అనే చిన్నారి రచించిన బ్రేవరీ ఆఫ్ హనుమాన్ అనే బాలల సాహిత్యం అనే కథల పుస్తకాన్ని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. అతి చిన్న వయస్సులో రచనలకు ప్రేరణగా నిలిచినందుకు ఆయన ఆర్యను అభినందించారు. భవిష్యత్‌లో ఆర్య గొప్ప రచయితగా మారాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

### డీ అడిక్షన్ సెంటర్ల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

చాదర్‌ఘాట్: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో డీ అడిక్షన్ సెంటర్ల నిర్వహణకు స్వచ్ఛంద సంస్థలు దరఖాస్తులు చేసుకోవాలని వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ శాఖ డైరెక్టర్ బి.శైలజ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డ్రగ్స్ బాధితులకు పునరావాసం కల్పించేందుకు జిల్లా కేంద్రాలలో డీ అడిక్షన్ ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రాష్ట్రంలోని సూర్యాపేట, నాగర్ కర్నూల్, సిరిసిల్ల, మహబూబ్‌బాద్, మహబూబ్‌నగర్, వనపర్తి, సంగారెడ్డి, నారాయణపేట జిల్లాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. వివరాలకు నల్గొండ క్రాస్ రోడ్డులోని వికలాంగుల సంక్షేమ భవనంలోని కార్యాలయాన్ని సందర్శించాలన్నారు.

### తలసేమియా బాధితులకు ఉచిత వైద్య సేవలు

మన్సూరాబాద్: తలసేమియా బాధితులకు ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌లో ఉచిత వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ఎస్.నర్సింహారావు, డాక్టర్ కంచన్ చన్నావర్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి రోజు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తలసీమియా వ్యాధి లక్షణాలను ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స చేయవచ్చన్నారు.

### వరద నీటి పైప్‌లైన్ పనులు ఆపాలి



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న పవన్‌కుమార్

నాగోలు: ఎల్‌బీనగర్ నుంచి మూసీ వరకు వరద నీటి పైప్‌లైన్ పనులను పరిసర కాలనీ వాసులకు సమాచారం ఇవ్వకుండా ఎలా ప్రారంభిస్తారని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కాలనీ వద్ద కొనసాగుతన్న వరదనీటి పైప్‌లైన్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. మూసీకి సరైన ఔట్‌లేట్ లేదని వెంటనే పైప్‌లైన్ పనులను ఆపాలన్నారు. పై కాలనీల నుంచి వచ్చే వరద నీటితో వర్షాకాలంలో న్యూ నాగోల్ కాలనీ, సమతపూరి కాలనీ, భరత్‌నగర్ వరదతో మునిగిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. పైప్‌లైన్ ఔట్‌లేట్ పూర్తిగా పరిశీలించిన తర్వాతే పనులు ప్రారంభించాలని సూచించారు.

### నేడు ప్రత్యేక పూజలు

వనస్థలిపురం: హనుమాన్ జయంతి సందర్భంగా వనస్థలిపురం శారదానగర్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం పూజలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.గూడూరు హరినాథ్ ఆవిష్కరించారు. గురువారం స్వామి వారికి పంచామృములతో మహాన్యాస పూర్వక మన్యుసూక్త సహిత ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష తమలపాకులతో అర్చన, మంగళ హారతి, మంత్రపుష్పం, ఆశీర్వచనం, సాయంత్రం ధార్మిక ప్రవచన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సురేందర్, సుబ్బారావు, రాజశేఖర్‌శర్మ పాల్గొన్నారు.

# జాడలేని ఓపెన్ జిమ్

**రూ.10 లక్షలు మంజూరు**

- రెండేళ్లు దాటినా పట్టించుకోని అధికారులు



ఓపెన్ జిమ్‌కు కేటాయించిన స్థలం

బడంగ్‌పేట్: ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యమని, అందుకు రోజువారి వ్యాయామం చాలా అవసరమని గుర్తించిన ప్రభుత్వం ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్ పరిధి 21వ డివిజన్ భీష్మానగర్ కాలనీలో జిమ్ ఏర్పాటుకు 240 గజాల స్థలం కేటాయించింది. కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయించింది. 2023 మేలో నాటి విద్యాశాఖ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సబితారెడ్డి.. కార్పొరేటర్ బంగారు అనితతో కలిసి జిమ్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కానీ నేటి వరకు ఓపెన్ జిమ్‌కు ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టలేదు. శిలాఫలకం చుట్టూ గడ్డి పెరిగి, అపరిశుభ్రంగా మారింది. ఇదిలా ఉండగా.. కుటుంబంలో నలుగురు ఉంటే ప్రైవేట్ జిమ్‌కు వెళ్లాలంటే సుమారు రూ.15 నుంచి 20 వేల దాక ఖర్చు అవుతుందని, ప్రభుత్వం జిమ్ ఏర్పాటు చేస్తే స్థానికులందరికీ ఉపయోగంగా ఉంటుందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. శంకుస్థాపన చేసి రెండేళ్లు గడుస్తున్నా.. జిమ్ జాడ కానరావడం లేదని, ఎవరూ దాని ఊసెత్తడం లేదని వాపోతున్నారు.

**కాలనీపై చిన్నచూపు**



జిమ్ కోసం ఎదురు చూస్తున్నాం. శంకుస్థాపన చేసినప్పుడు నెల రోజుల్లోనే పూర్తి చేసి కాలనీవాసులకు అందుబాటులోకి తెస్తామని పాలకులు, అధికారులు హామీ ఇచ్చారు. రెండేళ్లు గడిచినా అది నెరవేడం లేదు. అడిగినా పట్టించుకునే వారు లేరు. భీష్మానగర్ కాలనీపై అధికారులు, రాజకీయ నాయకులు చిన్నచూపు చూస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి త్వరగా జిమ్ ఏర్పాటు చేయాలి.

– బంగారు సురేష్, స్థానికుడు

# నేడు హనుమాన్ జయంతి

- ముస్తాబైన శ్రీవీరాంజనేయ స్వామి ఆలయం



కొలువైన స్వామివారు

మహేశ్వరం: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహేశ్వరం మండలం ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయం హనుమాన్ జయంతి ఉత్సవాలకు ముస్తాబైంది. సుమారు 500 వందల ఏళ్ల నాటి అక్కన్న మాదన్న కాలం నాటి ఆలయ ఉత్సవాలను ఏటా కమిటీ, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తారు. స్వయంభువుగా వెలసిన స్వామివారు.. దక్షిణ ముఖం కలిగి తూర్పునకు నమస్కారం చేసి ఉంటారు. భక్తుల కొంగు బంగారమైన స్వామివారి ఆలయాన్ని.. ట్రస్టీలు కోరుపోలు రఘుమారెడ్డి, ప్రభాకర్‌రెడ్డిలు ప్రభుత్వ ప్రోత్సాహంతో అభివృద్ధి చేస్తున్నారు. గురువారం జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 5 గంటలకు సుప్రభాతం, 5.30 గంటలకు పంచామృతాభిషేకం, 7 గంటలకు నాగవల్లి పూజ(లక్ష తమలపాకుల పూజ), 8 గంటలకు మన్యూసూక్త హోమం, మధ్యాహ్నం 1 గంటకు హారతి, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు వేద పండితుల సమక్షంలో నిర్వహిస్తారు. ఉత్సవాలకు ముఖ్య అతిథిలుగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డి హాజరు కానున్నారని ఆలయ అధికారి వై.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.



మహేశ్వరం: రాజీవ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

# సాంకేతిక విప్లవ ఆద్యుడు రాజీవ్‌గాంధీ

**మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యాదయ్య**

మహేశ్వరం: సాంకేతిక విప్లవ ఆద్యుడు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య అన్నారు. రాజీవ్ వర్ధంతి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేయడమే కాకుండా, విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన మహానేత రాజీవ్ అని కొనియాడారు. దేశాన్ని అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన నిలిపిన ఘనత ఆయనకే దక్కిందని పేర్కొన్నారు. యువతను సాంకేతిక రంగం వైపు మళ్లించడమే కాకుండా.. ప్రపంచ దేశాల ప్రముఖ కంపెనీలకు భారతీయులనే సీఈఓలుగా ప్రాతినిథ్యం వహించే స్థాయికి దేశాన్ని ముందుకు తీసుకెళ్లారని వివరించారు. నేటి యువత రాజీవ్ ఆశయాలను అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు యాదయ్య, మంత్రి బాల్‌రాజ్, శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షుడు లాజర్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు మహ్మద్ ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

**మీర్‌పేటలో..**

మీర్‌పేట: సైన్స్‌ను ప్రోత్సహించి దేశాన్ని ఆధునికత వైపు తీసుకెళ్లేందుకు రాజీవ్‌గాంధీ ఎంతో కృషి చేశారని టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. రాజీవ్ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం మీర్‌పేటలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన.. దివంగత నేత చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, గజ్జెల రాంచందర్, నిమ్మల వెంకటేశ్ గౌడ్, మాధరి శ్రీనివాస్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

### రోడ్ల పక్కన చెత్తవేస్తే జరిమానా విధిస్తాం

చాదర్‌ఘాట్: హోటళ్లు, పాన్ డబ్బాలు, మెస్‌లు, టీ కొట్ల నిర్వాహకులు ఇష్టానుసారంగా రోడ్ల పక్కన చెత్తవేస్తే జరిమానాలు విధిస్తామని సర్కిల్–6 డీసీ జయంత్ హెచ్చరించారు. బుధవారం వ్యాపారులకు చెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.. వ్యాపారాలు ముగిసిన తర్వాత రాత్రి సమయాల్లో చెత్తను రోడ్ల పక్కన పారబోస్తున్నారని అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. మొదట అవగాహన కల్పించి కౌన్సెలింగ్ ఇస్తామని వినకపోతే నోటీసులు జారీ చేసి ట్రేడ్‌లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. ప్రతి వ్యాపారి షాపు ఎదుట బిన్లు ఏర్పాటు చేసుకోవాలని నిండిన తర్వాత స్వచ్ఛ ఆటోకు అందించాలన్నారు. వ్యాపార సముదాయాలు, సూపర్ మార్కెట్లు, టీ బండ్లు, దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్నామని ప్రతి ఒక్కరూ సహకరిస్తేనే పరిసరాల పరిశుభ్రత సాధ్యమవుతుందని మలక్‌పేట సర్కిల్–6 ఏఎంహెచ్‌ఓ రుద్ర శ్రీనివాస్ పేర్కొన్నారు.

### సీసీ కెమెరాలు ప్రారంభం

హస్తినాపురం: డివిజన్ అభివృద్ధి కోసమే పార్టీ మారానని, ప్రస్తుతం డివిజన్ శరవేగంగా అభివృద్ధి చెందుతుందని హస్తినాపురం కార్పొరేటర్ సుజాతానాయక్ అన్నారు. విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్‌కాలనీలో బుధవారం ఆమె సీసీ కెమెరాలు, సీసీ రోడ్డు ప్రారంభోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి ఎంపీగా ఉన్నప్పుడు మంజూరు చేసిన సీసీ కెమెరాలను నేడు ప్రారంభించడం జరిగిందన్నారు. జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్‌గా ఉన్నందున డివిజన్‌కు అధిక నిధులు మంజూరు చేయిస్తున్నానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి, అమర్‌నాథ్‌యాదవ్, ప్రవీణ్, రాహుల్‌సాగర్, విష్ణువర్ధన్, బద్రి పాల్గొన్నారు.

# అద్దెభవనంలోకి అంగన్‌వాడీ కేంద్రం!



అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఐసీడీఎస్ అధికారులు, కమిటీ సభ్యులు

సాక్షి ఎఫెక్ట్..

కందుకూరు: శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ భవనం. అక్కడికి పిల్లలను పంపడానికి ఇష్టపడని తల్లిదండ్రులు అని పేర్కొంటూ బుధవారం 'శిథిలావస్థలో అంగన్‌వాడీ' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీలత, జ్ఞానేశ్వరి, సబిత మండల పరిధి ఆకులమైలారం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామ పెద్దలు, ఏఎల్‌ఎంఎస్‌సీ(అంగన్‌వాడీ లెవల్ మానిటరింగ్ కమిటీ) సభ్యులతో సమీక్ష నిర్వహించారు. పంచాయతీ పరిధిలో స్థలం చూపితే ఎవరి సహాయంతోనైనా నూతన భవనాన్ని నిర్మించుకుందామని, అప్పటి వరకు తాత్కాలికంగా అద్దె భవనంలోకి మార్చాలని నిర్ణయించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రుణాలు వినియోగించుకోండి

**పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్**



రైతులకు రుణాల ప్రొసీడింగ్‌లు అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్

ఆమనగల్లు: పీఏసీఎస్‌ల ద్వారా సన్న, చిన్నకారు రైతులకు అందిస్తున్న దీర్ఘకాలిక రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని డీసీసీబీ శాఖ ఆవరణలో బుధవారం పలువురు రైతులకు మంజూరైన దీర్ఘకాలిక రుణాలను డీసీసీబీ మేనేజర్ అరుణతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఏసీఎస్‌ల ద్వారా పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలు అందిస్తున్నామని తెలిపారు. వ్యవసాయం కోసం ట్రాక్టర్, డెయిరీ, ఫౌల్ట్రీఫాంల ఏర్పాటుకు దీర్ఘకాలిక రుణాలు ఇస్తున్నామని, రైతులు వాటిని వినియోగించుకోవాలని కోరారు. పొందిన రుణాలను సకాలంలో చెల్లించాలని, అప్పుడే మరికొంత మందికి రుణాలు అందించేందుకు వీలు కలుగుతుందని వివరించారు. పీఏసీఎస్ సీఈఓ దేవేందర్, సిబ్బంది మహేశ్, కిసాన్ మిత్ర డైరెక్టర్ రమేశ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

# కాలనీలో కార్పొరేటర్ పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న నర్సింహగుప్తా

చైతన్యపురి: చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా బుధవారం శానిటేషన్, హార్టికల్చర్ సిబ్బందితో కలిసి ప్రభాత్‌నగర్‌లో పర్యటించారు. కాలనీలోని పార్కును సందర్శించి అక్కడ పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తరలింపజేశారు. కాలనీలో మట్టికుప్పలు, ఎండిపోయిన చెట్ల కొమ్మలను రెండ్రోజుల్లో తరలించే ఏర్పాటు చేయాలని డిప్యూటీ కమిషనర్ సుజాతను ఫోన్‌లో కోరారు. శానిటేషన్ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించి కాలనీలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. కార్పొరేటర్ వెంట శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ బుచ్చయ్య, జవాన్ రమేష్, హార్టికల్చర్ సత్యనారాయణ, కాలనీవాసులు రాజగోపాల్, నర్సింహారావు, రఘురాం, రామారావు ఉన్నారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి సూచించారు. కృష్ణానగర్ కాలనీలో రూ.15.40లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారి నిర్మాణ పనులను బుధవారం ఆమె కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఐఎస్‌సదన్‌లోని కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. డివిజన్‌లో ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంపీ ఏఈ శిరీష, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, కాలనీ సభ్యులు జైపాల్‌రెడ్డి, శ్రీను, సునీల్, ప్రవీణ్, సత్యం పాల్గొన్నారు.

# సీపీఐతోనే దోపిడీ లేని వ్యవస్థ సాధ్యం

- పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి





మీర్‌పేట శాఖ మహాసభలో పాల్గొన్న రవీంద్రాచారి

మీర్‌పేట: ఎర్ర జెండా ద్వారానే అసమానతలు లేని సమ సమాజ సోషలిస్టు వ్యవస్థ సాధ్యమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి అన్నారు. బుధవారం నిర్వహించిన బాలాపూర్ మండల మీర్‌పేట శాఖ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేదలు, కార్మికులు, శ్రామికులు, మహిళల పక్షాన తరఫున నిరంతరం ఉద్యమాలు చేస్తున్న ఏకైక పార్టీ సీపీఐ అన్నారు. దోపిడీ లేని వ్యవస్థ రావాలంటే కమ్యూనిస్టు పార్టీల పోరాటాల ద్వారానే సాధ్యమని ఆయన చెప్పారు. రానున్న రోజుల్లోనూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం 11 మందితో మీర్‌పేట శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బండ యాదయ్య యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా సమితి సభ్యులు శివనాయక్, జిల్లెలగూడ శాఖ కార్యదర్శి పాండునాయక్, కార్యవర్గ సభ్యులు జాజుల అంజయ్య, ఛత్రునాయక్ పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- పేదలను మోసం చేసిన బీఆర్ఎస్
- వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యాదయ్య
- పలువురికి ఇళ్లు మంజూరు పత్రాల అందజేత



మహేశ్వరం: మాణిక్యమ్మగూడలో ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న నాయకులు

మహేశ్వరం: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య అన్నారు. ఇది నిరుపేదలకు వరంలాంటిదని పేర్కొన్నారు. బుధవారం మండల పరిధి మాణిక్యమ్మగూడ గ్రామంలో 14 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నేతలతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు భూముల పంపిణీతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల పట్టాలను అర్హులకు అందజేస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో అర్హులకు డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వలేదని, పార్టీ కార్యకర్తలు, నాయకులకే ఇచ్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సొంతింటి కల నెరవేరుస్తుందని చెప్పారు. ఇంటి నిర్మాణం 400 ఫీట్లు తగ్గకుండా ఆర్‌సీసీ స్లాబుతో నిర్మాణం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఉత్తర్వులు వచ్చిన 30 రోజుల్లో ఇంటి నిర్మాణం పనులు మొదలు పెట్టాలన్నారు. కార్యక్రమంలో మాణిక్యమ్మగూడ ఇందిరమ్మ కమిటీ అధ్యక్షుడు లోకేష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, నాయకులు దావీదు పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

**జల్‌పల్లిలో 261 ఇళ్లు**

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో 261 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని కమిషనర్ బి.వెంకట్రామ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఆయా లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు ఇవ్వడంతో పాటు ఇళ్లకు ముగ్గు పోస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నప్పటికీ, స్థానికంగా చాలా వరకు నోటరీ ఇళ్లు ఉండడంతో తిరస్కరణకు గురయ్యాయన్నారు.

**కాంగ్రెస్ పాలనలో..**

కందుకూరు: కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకు సముచిత న్యాయం జరుగుతుందని మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్ గౌడ్, పార్టీ మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్ తెలిపారు. బుధవారం మండల పరిధి దావూద్‌గూడ, బాచుపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ చొరవతో కలిసి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, చందు, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, విజయరాజు, నేచ్యానాయక్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులు ఎం.విజయ్, నవీన్‌గౌడ్, మాధవి, యుగంధర్‌రెడ్డి, బాలమల్లేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: దావూద్‌గూడలో భూమి పూజ చేస్తున్న నాయకులు

### ఇంటి నిర్మాణాలకు మార్కింగ్



మంజూరు పత్రం అందజేస్తున్న అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు

తుక్కుగూడ: పేదోడి సొంతింటి కల నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టిందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు బంటు ధనంజయ్ అన్నారు. అందులో భాగంగానే తమ వార్డుకు 15 ఇళ్లను మంజూరు చేసిందని, వాటి నిర్మాణాలకు మార్కింగ్ చేశామని తెలిపారు. బుధవారం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధి 6వ వార్డు ఇమామ్‌గూడ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మార్కింగ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు ఇంటి మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు బండ శ్రీను, చందర్, మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ మల్లేశ్, సిబ్బంది యాదమ్మ, మహేశ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.